# పోరాట ఘట్టాల్లో 'దేవర'



ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిస్తున్న తాజా చిత్రం 'దేవర'. జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తున్నది. బాలీవుడ్ అగ్ర హీరో సైఫ్అలీఖాన్ కీలక పాత్రను పోషిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ జరుపుకుంటున్నది. తాజా సమాచారం ప్రకారం హైదరాబాద్‌లో తీర్చిదిద్దు తున్న భారీ సెట్‌లో పోరాట ఘట్టాలను తెరకెక్కించబోతున్నట్లు తెలిసింది. ఎన్టీఆర్-సైఫ్అలీఖాన్ మధ్య వచ్చే ఈ యాక్షన్ ఎపిసోడ్ సినిమాలో హైలైట్‌గా నిలుస్తుందని చెబుతున్నారు. ఎన్టీఆర్ జన్మదినోత్సవం సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్ ఈ సినిమాపై అంచనాల్ని పెంచింది. విస్మరణకు గురైన ఓ తీర ప్రాంత నేపథ్య కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మృగాల్లాంటి మనుషుల బారి నుంచి తన వారిని రక్షించుకునే ధీరోదాత్తుడైన వ్యక్తిగా ఎన్టీఆర్ పాత్ర అత్యంత శక్తివంతంగా సాగుతుందని సమాచారం. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ పతాకాలపై సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 5న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.



కాజల్ అగర్వాల్

# తెలుగు సినిమా నా పుట్టినిల్లు

అగ్ర కథానాయిక కాజల్ అగర్వాల్ నటిస్తున్న తాజా చిత్రానికి 'సత్యభామ' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. అఖిల్ డేగల దర్శకుడు. ఆరమ్ ఆర్ట్స్ పతాకంపై బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కళపల్లి నిర్మిస్తున్నారు. మహిళా ప్రధాన ఇతివృత్తమిది. ఆదివారం కాజల్ పుట్టిన రోజు సందర్భంగా ఫస్ట్ గ్లింప్స్‌ను ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ''మగధీర'లో మిత్రవిందగా కాజల్ అందరికి గుర్తుండిపోయింది. ఇప్పుడు కూడా అదే అందంతో అలరిస్తున్నది. పెళ్లయినా సరే కథానాయికలు తమ కెరీర్‌ను కొనసాగించాలి అనేందుకు కాజల్ మంచి ఉదాహరణ' అని అన్నారు. ఈ సినిమాలో సత్యభామగా కాజల్ పాత్ర చిత్రణ కొత్త పంథాలో ఉంటుందని దర్శకుడు తెలిపారు. కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ 'తెలుగు సినిమా నాకు పుట్టినిల్లు. కాస్త విరామం తర్వాత మళ్లీ తెలుగు సినిమా చేయడం చాలా ఆనందంగా ఉంది. 'సత్యభామ' అందరూ గుర్తుంచుకునే మంచి సినిమా అవుతుంది' అని చెప్పింది.



రామజోగయ్య శాస్త్రి, విక్రమ్, వివేక్ కూచిభొట్ల, శశిధర్ రెడ్డి తదితరులు

# వసూళ్లలో రికార్డులు సృష్టిస్తున్నది

ప్రభాస్ కథానాయకుడిగా ఓంరౌత్ దర్శకత్వంలో రూపొందిన పౌరాణిక చిత్రం 'ఆదిపురుష్' ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలో సోమవారం 'రామజయం రఘు రామ జయం' పేరుతో సక్సెస్‌మీట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ 'ఇలాంటి ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని మా సంస్థ ద్వారా విడుదల చేయడం ఆనందంగా ఉంది. నైజాంలో దాదాపు 500 స్క్రీన్లలో విడుదల చేయగా..తొలిరోజు 13.65 కోట్ల వసూళ్లు వచ్చాయి. స్టార్ హీరో చిత్రానికి ఇదొక రికార్డు. రెండో రోజు ఎనిమిది కోట్ల వసూళ్లు సాధించింది. కలెక్షన్స్ స్థిరంగా కొనసాగుతున్నాయి' అన్నారు. యుగాలు, తరాలు మారినా రామ కథ గొప్పతనం అలాగే ఉంటుందని, భక్తిభావంతో ప్రేక్షకులు ఈ సినిమాను ఆదరిస్తున్నారని మాటల రచయిత భీమ్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సినిమాలో అన్ని పాటలను తానే రాశానని, చక్కటి భావోద్వేగాలతో సినిమా ఆకట్టుకుంటున్నదని గీత రచయిత రామజోగయ్యశాస్త్రి తెలిపారు. సహ నిర్మాత వివేక్ కూచిభొట్ల మట్లాడుతూ 'రామనామాన్ని ప్రతీ గడపకు చేర్చాలనే ప్రయత్నంలో మేము సఫలీకృతులమయ్యాం. మూడు రోజులుగా వచ్చిన కలెక్షన్స్ రికార్డులు సృష్టిస్తున్నాయి. మన పౌరాణిక పురుషుల గురించి ఈ తరం పిల్లలు తెలుసుకుంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా కోటి మంది ప్రేక్షకులు ఈ సినిమా చూశారు' అన్నారు.



ప్రశాంత్ నీల్



# రజనీకాంత్ చిత్రంలో యష్

'కేజీఎఫ్' సిరీస్‌లో వచ్చిన రెండు చిత్రాలతో దేశవ్యాప్తంగా తిరుగులేని పాపులారిటీని సంపాదించుకున్నారు కన్నడ హీరో యష్. ఆయన తన తదుపరి చిత్రాన్ని మహిళా దర్శకురాలు గీతూ మోహన్‌దాస్‌తో చేయబోతున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఇదిలావుండగా తాజా సమాచారం ప్రకారం సూపర్‌స్టార్ రజనీకాంత్ చిత్రంలో యష్ అతిథి పాత్రలో కనిపించనున్నారని తెలిసింది. వివరాల్లోకి వెళితే... లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో రజనీకాంత్ తన 171వ చిత్రానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ సినిమా తెరకెక్కనుంది. ఈ సినిమాలో ప్రతినాయక ఛాయలుండే అతిథి పాత్రలో యష్ నటించబోతున్నారని సమాచారం. లోకేష్ కనకరాజ్ డైరెక్ట్ చేసిన 'విక్రమ్' చిత్రంలో సూర్య మాఫియా డాన్ రోలెక్స్ పాత్రలో మెప్పించిన విషయం తెలిసిందే. అదే తరహాలో రజనీకాంత్ చిత్రంలో యష్ పాత్ర ఉంటుందని సమాచారం. లోకేష్ కనకరాజ్ ప్రస్తుతం విజయ్‌తో 'లియో' చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ అనంతరం రజనీకాంత్ చిత్రాన్ని పట్టాలెక్కిస్తారు.

# పోలీస్ రక్షణ కోరిన 'ఆదిపురుష్' రచయిత



మనోజ్ ముంతాషిర్

ప్రభాస్ కథానాయకుడిగా ఓంరౌత్ రూపొందించిన పౌరాణిక చిత్రం 'ఆదిపురుష్' ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. భారతీయ పురాణేతిహాసం రామయాణాన్ని వక్రీకరించారని, హనుమాన్ పాత్రధారి చెప్పిన సంభాషణలు ఆ పాత్ర ఔచిత్యాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని తీవ్ర విమర్శలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో సంభాషణల్లో మార్పులు చేస్తామని చిత్ర రచయిత మనోజ్ ముంతాషిర్ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా విషయంలో తనకు వరుసగా బెదిరింపు కాల్స్ వస్తున్నాయని, ప్రాణహాని ఉన్నందున తగిన రక్షణ కల్పించాలని రచయిత మనోజ్ ముంతాషిర్ ముంబయి పోలీసులను ఆశ్రయించారు. త్వరలో డైలాగ్స్‌ను మార్చబోతున్నామని చెప్పినా వివాదం సద్దుమణిగేలా కనిపించడం లేదని రచయిత మనోజ్ ముంతాషిర్ పోలీసులకు వివరించినట్లు తెలిసింది. ఈ వివాదం ముగిసేవరకు రచయిత మనోజ్ ముంతాషిర్‌కు రక్షణ కల్పిస్తామని ముంబయి పోలీసులు హామీ ఇచ్చారని సమాచారం.

# 'సలార్' టీజర్ సిద్ధం

ప్రభాస్ కథానాయకుడిగా నటించిన పౌరాణిక చిత్రం 'ఆది పురుష్' ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సినిమాపై కొన్ని వివాదాలు చెలరేగుతున్నా..బాక్సాఫీస్ వద్ద మాత్రం మంచి వసూళ్లను రాబడుతున్నది. 'ఆదిపురుష్' కోలాహలం ముగియడంతో ప్రభాస్ ఫ్యాన్స్ ఇప్పుడు 'సలార్' అప్‌డేట్ కోసం ఎదురుచూస్తున్నారు. ప్రశాంత్‌నీల్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని హోంబలే ఫిల్మ్స్ నిర్మిస్తున్నది. శృతిహాసన్ కథానాయిక. తాజా సమాచారం ప్రకారం ఈ నెలాఖరులో లేదా జూలై మొదటివారంలో టీజర్‌ను విడుదల చేయబోతున్నారని తెలిసింది. భారీ యాక్షన్ హంగులతో సింగరేణి బొగ్గు గనుల నేపథ్యంలో ఈ సినిమాలోని ప్రధాన భాగాన్ని తెరకెక్కించారు. ప్రశాంత్‌నీల్ డైరెక్ట్ చేసిన 'కేజీఎఫ్' చిత్రాల తరహాలోనే ఇంటెన్స్ యాక్షన్, ఎమోషన్స్ ప్రధానంగా 'సలార్' ప్రేక్షకుల్ని మెప్పిస్తుందని అంటున్నారు. సెప్టెంబర్ 28న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది.



అలియాభట్, రణ్‌వీర్‌సింగ్

# రాఖీ..రాణి ప్రేమకథ

రణ్‌వీర్‌సింగ్, అలియాభట్ జంటగా కరణ్‌జోహార్ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం 'రాఖీ ఔర్ రాణీకి ప్రేమ్ కహానీ'. జూలై 28న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. దాదాపు ఆరేండ్ల విరామం తర్వాత కరణ్‌జోహార్ దర్శకత్వ బాధ్యతలు చేపట్టడం..'గల్లీబాయ్' చిత్రం తర్వాత రణ్‌వీర్-అలియా జోడీ నటించిన చిత్రమిదే కావడంతో ఈ సినిమా అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. ఈ చిత్ర టీజర్‌ను నేడు విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా సోమవారం కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. చక్కటి ప్రేమకథ, ఫ్యామిలీ ఎమోషన్స్ కలబోతగా తనదైన శైలి మేకింగ్‌తో కరణ్‌జోహార్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారని అంటున్నారు. 'ఓ హృద్యమైన ప్రేమకథను ఆస్వాదించడానికి అందరూ సిద్ధంగా ఉండండి' అంటూ కరణ్‌జోహార్ తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఈ సినిమాపై స్పందించారు.



షకలక శంకర్, నందితాశ్వేత

# ఓ పాప నువ్వు తోపు

వెన్నెల కిషోర్, షకలక శంకర్, నందితా శ్వేత, నవమి గాయక్‌లు ముఖ్యతారలుగా నటిస్తున్న చిత్రం 'ఓ మంచి ఘోస్ట్'. శంకర్ మార్తాండ్ దర్శకుడు. అభినిక నిర్మాత. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రం నుంచి 'నువ్వు తోపు' అనే లిరికల్ వీడియోను ఇటీవల ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో విడుదల చేసింది చిత్రబృందం. నిర్మాత మాట్లాడుతూ ' ఇదొక వైవిధ్యమైన హారర్ కామెడీ చిత్రం. ఇందులోని ప్రతీ పాత్ర అందరికి ఎప్పటికి గుర్తుండిపోయే విధంగా ఉంటుంది. చిత్రంలోని ప్రతి సన్నివేశం ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేస్తుంది' అన్నారు. ఈ సమావేశంలో హీరోయిన్ నందితా శ్వేత, అనూప్ రూబెన్స్, షకలక శంకర్, దర్శకుడు శంకర్ మార్తాండ్ తదితరులు పాల్గొన్నారు.



నాగశౌర్య, యుక్తి తరేజా

# కల కంటూ ఉంటే..

నాగశౌర్య కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'రంగబలి'. పవన్ బాసంశెట్టి దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ఎస్ఎల్‌వి సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. యుక్తి తరేజా కథానాయిక. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నది. ఈ సినిమాలోని 'కల కంటూ ఉంటే..' అనే రెండో గీతాన్ని గురువారం విడుదల చేశారు. నాయకానాయికల మధ్య ప్రేమబంధాన్ని ఆవిష్కరించే చక్కటి మెలోడీ గీతమిదని స్వరకర్త సి.హెచ్. పవన్ తెలిపారు. కృష్ణకాంత్ రచించిన ఈ గీతాన్ని కల్యాణి, వైష్ ఆలపించారు. సత్య, సప్తగిరి, షైన్ టామ్ చాకో తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: దివాకర్ మణి, సంగీతం: పవన్ సి.హెచ్, రచన-దర్శకత్వం: సుధాకర్ చెరుకూరి.



శృతిహాసన్

# వైవిధ్యంగా జాతర



ప్రజ్వల్

ప్రముఖ కన్నడ నటుడు దేవరాజ్ తనయుడు ప్రజ్వల్ దేవరాజ్ కథానాయకుడిగా రూపొందనున్న చిత్రం 'జాతర'. నందన వనమ్ దర్శకుడు. గోవర్ధన్ రెడ్డి నిర్మాత. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభం కానుంది. నిర్మాత మాట్లాడుతూ 'డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రూపొందనున్న వైవిధ్యమైన ప్రేమకథ ఇది. లవ్‌స్టోరీ చాలా కొత్తగా ఉంటుంది. ఆగస్టులో చిత్రీకరణ ప్రారంభించి సంక్రాంతికి చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం. తెలుగు, తమిళ, కన్నడ, తమిళ, మలయాళ భాషల్లో చిత్రాన్ని విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో



అవికా గోర్

# భయపడుతూ చూస్తాను

'మహేష్‌భట్, విక్రమ్‌భట్ లాంటి గొప్ప ఫిల్మ్‌మేకర్స్‌తో కలిసి పనిచేయాలన్నది నా కల. '1920' చిత్రంతో ఆ కోరిక తీరింది. ఇంత త్వరగా ఇలాంటి అవకాశం రావడం నా అదృష్టం' అంటున్నది అవికాగోర్. ఆమె ప్రధాన పాత్రలో నటించిన చిత్రం '1920'. కృష్ణభట్ దర్శకుడు. ఈ నెల 23న విడుదల కానుంది. ఈ సందర్భంగా అవికాగోర్ మాట్లాడుతూ 'నేను హారర్ సినిమాల్ని ఇష్టపడతాను. భయపడుతూనే 'రాజుగారి గది' సినిమా చూశా. కానీ '1920' సీరియస్ హారర్ ఫిల్మ్. ఇలాంటి హారర్ సినిమా చేయడం నాకు తొలిసారి. చాలా కొత్త అనుభూతినిచ్చింది. ఈ సినిమా తరువాత నాకు మరిన్ని హారర్ సినిమాల్లో అవకాశాలు వస్తాయని అనుకుంటున్నాను' అన్నారు.

# కష్టమైనా భరించాల్సిందే..!

ఈ ఏడాది 'వాల్తేరు వీరయ్య' 'వీరసింహా రెడ్డి' చిత్రాలతో భారీ విజయాల్ని సొంతం చేసుకుంది చెన్నై సోయగం శృతిహాసన్. సోషల్‌మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తరచుగా అభిమానులతో సంభాషిస్తుంటుందీ భామ. తాజాగా ట్విట్టర్‌లో అభిమానులు అడిగిన పలు ప్రశ్నలు తనదైన శైలిలో సమాధానమిచ్చింది. సంగీతమంటే తనకు ప్రాణమని, నటనతో సమానంగా మ్యూజిక్‌ను ఇష్టపడతానని పేర్కొంది. మంచు ప్రదేశాల్లో నాయికలు చీర ధరించి నృత్యాలు చేయడం చాలా అసౌకర్యంగా ఉంటుందని కొద్ది రోజుల క్రితం ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో శృతిహాసన్ పేర్కొంది. ఇదే విషయం గురించి అభిమాని ఓ ప్రశ్న అడగ్గా.. 'మైనస్ ఉష్ణోగ్రతల్లో చీర కట్టుకొని డ్యాన్స్ చేయడం చాలా ఇబ్బందిగా ఉంటుంది. అయితే కొన్ని పాటలకు చీరలే బాగా సూటవుతాయి. అలాంటప్పుడు ఆ కష్టాన్ని భరించాల్సిందే. ప్రేక్షకులు కూడా ఆ తరహా గీతాలను చూడటానికి ఎంతో ఇష్టపడుతుంటారు. వారికోసమైనా బాధను ఓర్చుకోవాల్సిందే' అని చెప్పింది.